క్లుప్తంగా

ఫుడ్ ఫెస్ట్



ఫుడ్‌ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ

సుభాష్‌నగర్: విద్యార్థులు చదువుతో పాటు వివిధ అంశాల్లో రాణించాలని సూరారం కార్పొరేటర్ సత్యనారాయణ అన్నారు. శనివారం నార్త్‌సిటీ పాఠశాలలో నిర్వహించిన ఫుడ్‌ఫెస్ట్‌ను బీఆర్‌ఎస్ నాయకుడు సురేష్‌రెడ్డితో కలిసిన ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసుకుని తీసుకొచ్చిన వంటకాలను అందరు రుచి చూశారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల వద్ద ఉన్న వంటకాలను కొనుగోలు చేసి తిన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కోల వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అన్నపూర్ణమ్మకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

చింతల్: ఎస్ఎస్‌టీ బీసీ మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి ధర్మరాజు సమీప బంధువు ఇడ్డి అన్నపూర్ణమ్మ దశదిన కర్మ శనివారం చింతల్ మాణిక్యనగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు.

ఎండిపోయి..




ఓ వైపు ఎండలు మండుతున్నాయి. ఆ వేడికి చెట్లు ఎండిపోవడం కూడా సహజం. కాని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు కాలనీలలో ఒకచోట

చిగురిస్తూ..



చెట్టుకు అప్పడే చిగురిస్తున్న ఆకులతో దర్శనమిస్తుంటే.. మరోచోట నిండుగా పూలతో పలువురిని ఆకర్శిస్తోంది. ఇంకోచోట ఇవేమి లేకుండా ఓ చెట్టు

పూలతో!



పూర్తిగా ఎండిపోయి కనిపించింది. ఇలా వేసవి కాలంలో ఈ మూడు చెట్లు మూడు రకాలుగా దర్శనమిస్తున్నాయి.
- జగద్గిరిగుట్ట

గడప గడపకు హాథ్ సే హాథ్ జోడో



సూరారంలో పర్యటిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా 129 డివిజన్ (సూరారం) సంజయ్‌గాంధీ నగర్ (మారుతీ మెడికల్ షాప్), న్యూ షాపూర్‌నగర్‌లో టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్‌రెడ్డి కాంగ్రెస్ జెండాలను ఆవిష్కరించారు. గడపగడపకు హాథ్ సే హాథ్ జోడో అభియాన్ స్టిక్కర్ వేసి ప్రజలకు కరపత్రాలను అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వంద్వనీతిని వారికి వివరించారు. అధికారం కోసం ఆ రెండు పార్టీలు మోసపూరిత హామీలతో ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షుడు ఆవిజె జేమ్స్, పండరీరావు, మర్రి సంతోష్‌ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

వన్ డే ఫ్యామిలీ ట్రిప్



మొదటి టికెట్‌ను ఓ కుటుంబానికి అందజేస్తూ



ఆర్టీసీ కరపత్రం

జీడిమెట్ల: కుటుంబ సభ్యుల కోసం ఆర్టీసీ కొత్తగా ప్రవేశపెట్టిన వన్‌డే ఫ్యామిలీ ట్రిప్ ఇన్ సిటీ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని జీడిమెట్ల డీఎం విజయ్‌కుమార్ అన్నారు. ప్రతి శని, ఆదివారాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు పెద్దలు, ఇద్దరు పిల్లలు రూ.300కే ఫ్యామిలీ టికెట్ కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కడైనా 24గంటల పాటు ప్రయాణించవచ్చని తెలిపారు. అదే విధంగా స్త్రీలు, వృద్ధులు రూ.50కే టికెట్ పొంది హ్యాపీ అవర్స్ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో సైతం ప్రయాణించవచ్చని తెలిపారు.

అంబరాన్నంటిన బచ్‌పన్ పాఠశాల వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్: టీవీఆర్ విద్యా సంస్థల అధినేత టి.కోటిరెడ్డి ఆధ్వర్యంలో చింతల్, వెంకటేశ్వరనగర్, సూరారం బచ్‌పన్ పాఠశాలల వార్షికోత్సవాన్ని శ్రీసత్యసాయి నిగమాగమం ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి కేంద్ర బాలసాహిత్య అవార్డ్ గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణ, వంశీరెడ్డి, దీప్తిరెడ్డి, శ్రీ.వేణుమాధవ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రిటైర్డ్ సైంటిస్టు జనార్ధన్, దేవేందర్, యాదగిరి, రవిసూర, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.



దాండియాలో ఉపాధ్యాయులు

మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహించుకోవాలి

దళిత బహుజన నాయకులు

నిజాంపేట్: ఏప్రిల్ మాసంలో నిర్వహించే మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం ప్రగతినగర్ అంబేడ్కర్ సర్కిల్‌లో దళిత బహుజన నాయకులు సమావేశమయ్యారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అంబేడ్కర్ జయంతితో పాటు ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్‌రాం, ఏప్రిల్ 11న జ్యోతిబాబుపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 15న తిరిగి నిర్వహించే సమావేశంలో అందరి సమక్షంతో ఉత్సవాల కమిటీని ఏర్పాటు చేసి కమిటీ ఆధ్వర్యంలో అన్ని కార్యాక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దళిత, బహుజన, మైనారిటీ నాయకులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేకల నాగేశ్, మల్లికార్జున్, కమ్మెట కృష్ణ, రాజేందర్, సాయిలు, బాలాపీర్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని ఇన్ఫాంట్ జీసస్ హై స్కూల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. దీనిలో విద్యార్థులు తయారు చేసిన ట్రాఫిక్ సిగ్నల్, మోడల్ సిటీ, సోలార్ సిస్టం, ఎయిర్‌కూలర్ వంటి పలు నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన క్రీడా పోటీలు

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం 4వ అఖిల భారత దక్షిణ ప్రాదేశిక పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎ.పుల్లయ్య హాజరై క్రీడలను ప్రారంభించారు. అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, చెస్ తదితర క్రీడలు, ఆటలు రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథి డా.శ్రీనాథ్, ప్రిన్సిపాల్ సీడీ నాయుడు, సంచాలకులు డా.చెన్నకేశవ రావు, గిరిబాబు, స్వామి, అరుంధతి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న అతిథులు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్లో మల్లారెడ్డి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని వారి సమస్యలను చెబుతూ వారికి అవసరమైన మందులు ఉచితంగా పొందారు. ముఖ్యంగా ఆర్థోపెటిక్, డెంటల్, జనరల్ ఫిజీషియన్, ఐ చెకప్ చేయించుకొని, మల్లారెడ్డి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో మందులు పొందారు. ప్రధానోపాధ్యాయుడు మండవ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... ఈ విధమైన ఉచిత ఆరోగ్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మండవ సునీత, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రగతియాత్రలో ఎమ్మెల్యేకు సమస్యలు కన్పిస్తలేవా?

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



కాలనీవాసులతో పర్యటిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11 డివిజన్‌లోని హై విజన్ గేటెడ్ కమ్యూనిటీలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కాలనీవాసులతో కలిసి పర్యటించారు. సినీప్లానెట్ నుంచి హై విజన్ అపార్ట్‌మెంట్ వరకు గుంతలమయంగా మారిన రోడ్డును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు ఈ రోడ్డుని వేయించానని.. కనీసం మరమ్మతులు చేయించకపోవడం మున్సిపాలిటీ మొద్దు నిద్రకు నిదర్శనమని విమర్శించారు. ప్రగతియాత్ర పేరిట తిరుగుతున్న ఎమ్మెల్యేకు ఈ సమస్యలు కన్పిస్తలేదా అని ప్రశ్నించారు. తక్షణమే మున్సిపల్ కమిషనర్ స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు బీజేపీ నేత రంగారావ్ నివాసంలో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బీజేపీ సీనియర్ నేత మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు రాజిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, శివాజీరాజు, ఉదయ్, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ రాముగౌడ్, బీజేపీ నిజాంపేట్ అధ్యక్షులు ఆకుల సతీష్, నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై కేసు నమోదు

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ కేసు నమోదైంది. కొంపల్లి ప్రాంతానికి చెందిన చిన్నూ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

ఇంటింటికీ తెలుగుదేశం

నిజాంపేట్: ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని టీడీపీ రాష్ట్ర నాయకుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. తెలంగాణ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేసిన పనులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు లీడర్ నర్సింహ్మరెడ్డి, మాజీ ఎంపీటీసి నందిగామ సత్యనారయణ, మాజీ వార్డు సభ్యుడు దూసకంటి వెంకటేశ్, అబ్బురి సాయి, నాగేశ్, చంద్రహాస్, రాము, ఉపేంద్ర, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలి



ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి ఐడీపీఎల్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు, బీఆర్ఎస్ కార్యకర్తలు



జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో కార్పొరేటర్ల ఆధ్వర్యంలో నిరసన

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం చింతల్ ఐడీపీఎల్ చౌరస్తాలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ నిరసనలో బండి సంజయ్ దిష్టిబొమ్మను మహిళలు చెప్పులతో కొట్టి.. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం సంజయ్ వ్యాఖ్యలపై చర్యలు తీసుకొని వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో మహిళలు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

◆ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో..

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని లాస్ట్ బస్టాప్ వద్ద బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసి నినాదాలు చేశారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, రావుల శేషగిరి, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, చింతల్ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ రఫీ, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.